సాక్షి సూర్యాపేట
బుధవారం । 1 । జనవరి । 2025






లక్ష్యం చేరుకుంటాం..


కొత్త సంవత్సరంలో ఉద్యోగం, ఉపాధి సాధనే ధ్యేయమంటున్న యువత


గతేడాది నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరడంలో వెనుకబాటు | సోషల్ మీడియా వినియోగంలో తగ్గేదేలే.. | సామాజిక సేవపై మాత్రం అనాసక్తి.. | 'సాక్షి' సర్వేలో యువత మనోగతం

సాక్షి నెట్‌వర్క్ : నూతన సంవత్సర వేళ యువత మనోభావాలను తెలుసుకునేందుకు 'సాక్షి' ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా యువత నిర్దేశించుకున్న లక్ష్యాలు, వాటి అమలు.. ఈ ఏడాది ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు.. వాటి కోసం ఏర్పాటు చేసుకున్న ప్రణాళిక.. సెల్‌ఫోన్ వాడకంపై ఈ సర్వే సాగింది.










సర్వే శాంపిల్స్ ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాల నుంచి 1500 మంది 25 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సున్న యువతీ యువకులను ఈ సర్వేలో భాగస్వాములను చేశాం. వారిలో 900 మంది యువకులు, 600మంది యువతులు ఉన్నారు.

అనుకున్నది ఘనం.. సాధించింది స్వల్పం

గత సంవత్సరం (2024) ప్రారంభం రోజున యువత తీసుకున్న నిర్ణయాలు ఎంతో ఘనంగా ఉన్నా.. వాటిని అమలు చేయడంలో మాత్రం వెనుబడి పోయింది. ప్రత్యేకంగా లక్ష్యాలను నిర్దేశించుకోలేదని.. అనుకున్న వాటిలో కొంతమేర సాధించామని వెల్లడించారు. ఇక ఈ నూతన సంవత్సరంలో మాత్రం ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడాలని.. ప్రభుత్వ, ప్రైవేట్ ఏదైనా పర్వాలేదని చెప్పుకొచ్చారు. ఉద్యోగం సాధించలేని పక్షంలో స్వయం ఉపాధి చూసుకుంటామని దృఢంగా చెప్పడం ఆసక్తి కలిగించింది. కానీ.. సామాజిక సేవ చేయడానికి మాత్రం యువత పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇక మొబైల్‌తో గడిపే సమయం గతం (2023) కంటే ఎక్కువైందని పలువురు మొహమాటపడుతూ చెప్పారు.







న్యూ ఇయర్ జోష్



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో డ్యాన్స్ చేస్తూ న్యూ ఇయర్ 2025కు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు



సూర్యాపేటలో తనిఖీలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్




మంత్రి ఉత్తమ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



మఠంపల్లిలోని శుభవార్త చర్చిలో న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

మఠంపల్లి: జిల్లా ప్రజలకు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం రాత్రి మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త చర్చిలో న్యూఇయర్ కేక్‌కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025లో మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫాదర్ మార్టిన్, స్రవంతి కిషోర్‌రెడ్డి, శివారెడ్డి, మంజీనాయక్ పాల్గొన్నారు.



వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ఆన్‌లైన్ క్లాస్ ప్రొజెక్టర్‌ను వీక్షిస్తున్న కలెక్టర్, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్

సూర్యాపేట : పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరముందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు.మంగళవారం సూర్యాపేట మండలం బాలెంల జెడ్పీ ఉన్నత పాఠశాలను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి కలెక్టర్ సందర్శించారు. కంప్యూటర్ ల్యాబ్‌లో ఉన్న 6వ తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారిసమాధానాలతో సంతృప్తి చెందారు. 9వ తరగతి విద్యార్థులు ఫిజిక్స్ సబ్జెక్ట్ పై పలు ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పడంతో మెచ్చుకున్నారు. 10వ తరగతి విద్యార్థుల రైటింగ్ బాగుండడం.. ఇంగ్లిష్‌లో చక్కగా మాట్లాడటంతో అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్ప్రెడ్ ఇండియా సంస్థ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి పాటుపడడం అభినందనీయమన్నారు. రమేష్ రెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్‌స్కిల్స్ నేర్చుకుంటే ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. కార్యక్రమంలో డీఈఓ అశోక్, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎం ప్రసాద్, సోమశేఖర్, సైదులు, సంధ్యారాణి పాల్గొన్నారు.















యాదగిరిగుట్టలో ప్రత్యేక ఏర్పాట్లు

- నూతన సంవత్సరం మొదటిరోజు భక్తులు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు ఈఓ వెల్లడి

యాదగిరిగుట్ట: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు అధికంగా రానున్న నేపథ్యంలో ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో వేకువ జామునే స్వామివారికి సుప్రభాతం, అభిషేకం, సహస్రనామార్చన వంటి పూజలు పూర్తిచేసి, 7గంటలకు భక్తులకు దర్శనాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ భాస్కర్‌రావు మంగళవారం ‘సాక్షి’కి వెల్లడించారు. భక్తులకు రద్దీకి అనుగుణంగా లడ్డూ, పులిహోర ప్రసాదాలను తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానాలయ ముఖ మండపం, గర్భాలయ ముఖ ద్వారం వంటి ప్రాంతాల్లో పూలు, అరటి తోరణాలతో అలంకరించారు. కొత్త ఏడాది మొదటి రోజు సుమారు 70వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని అంచనా వేస్తున్నట్లు ఈఓ చెప్పారు. వీఐపీలు వస్తే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే అంశాలను ఇప్పటికే అధికారులకు సూచించామన్నారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించామన్నారు.

నేటి నుంచి ప్రత్యేక దర్శనం..

యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులు, చంటిపిల్లల తల్లులకు బుధవారం నుంచి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి 11.30గంటల మధ్యలో, సాయంత్రం బ్రేక్ దర్శనం పూర్తయిన తర్వాత 5గంటల నుంచి 5.30గంటల సమయంలో దివ్యాంగులు, చంటిపిల్లలు, వృద్ధులకు ప్రత్యేక దర్శనం చేయిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తూర్పు ద్వారం ముందు ప్రత్యేక షెడ్డులో కూర్చోబెట్టి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు.


విద్యుత్ కాంతుల వెలుగుల్లో యాదగిరిగుట్ట ఆలయం

సుధా బ్యాంక్‌కు ఐఎస్‌ఓ సర్టిఫికెట్


సుధా బ్యాంక్ చైర్మన్, ఎండీకి ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న హైమ్ అంతర్జాతీయ సర్టిఫికేషన్ సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ ఆలపాటి శివయ్య

సూర్యాపేట: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆరు శాఖలు కలిగి ఉండి, 25వ వసంతంలోకి అడుగుపెట్టిన సుధా బ్యాంక్ ఐఎస్ఓ సర్టిఫికెట్ సాధించింది. మంగళవారం సూర్యాపేటలోని సుధా బ్యాంకులో హైమ్ అంతర్జాతీయ సర్టిఫికేషన్ సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ ఆలపాటి శివయ్య ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ.. బ్యాంక్ ఎండీ, సిబ్బంది, పాలకవర్గం పనితీరు రిజర్వు బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా అన్నీ పాలసీలను, సర్క్యులర్స్‌ను పాటిస్తుండడంతో ఐఎస్ఓ సర్టిఫికెట్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సర్టిఫికెట్ అత్యుత్తమ సాంకేతికత, సృజనాత్మకత, నవ్యత కలిగి ఉన్న శాస్త్ర పరిశోధన, ఫార్మా, హాస్పిటల్స్‌కు ఇస్తామని తెలియజేశారు. అనంతరం బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ.. సుధా బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలు, నూతన సంవత్సర వేడుకలతో పాటుగా ఐఎస్ఓ సర్టిఫికెట్ ఈ రోజే రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 25 సంవత్సరాలుగా తమ బ్యాంకు ఎన్నో సేవలు అందిస్తూ ముందుకు సాగుతుందన్నారు. అనంతరం బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పానుగోటి నిర్మల, డైరెక్టర్లు బోనగిరి భాస్కర్, శంకర్‌లాల్, ఏపూరు శ్రవణ్‌కుమార్, కక్కిరేణి చంద్రశేఖర్, బాణావత్ సుజాత, డాక్టర్ మీలా సందీప్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా, వస్త్ర వ్యాపారి గండూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫణిగిరి క్షేత్రాన్ని సందర్శించిన విదేశీ బౌద్ధ పరిశోధకులు


ఫణిగిరిలోని మ్యూజియంలో గల బౌద్ధ సంపద గురించి బౌద్ధ పరిశోధకులకు వివరిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

నాగారం : నాగారం మండలంలోని ఫణిగిరి బౌద్ధక్షేత్రాన్ని మంగళవారం న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన బౌద్ధ పరిశోధకులు ప్రొఫెసర్ సారా, ప్రొఫెసర్ జాఫ్రీషా సందర్శించారు. ఈ సందర్భంగా రెండు వేల ఏళ్ల నాటి ఫణిగిరి బౌద్ధ చరిత్ర, బౌద్ధ స్థూపాలు, చైత్యగృహాలు, శిలామండపాలు, విహారాలు, స్థానిక ప్రదర్శనశాలలోని సిద్ధార్థుని జననం, మహాభినిష్క్రమణం, జాతక కథలు, బుద్ధుని శిల్పాల గురించి పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ, బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వారికి వివరించారు. క్రీ.పూ 1 నుంచి క్రీ.శ 4వ శతాబ్దం మధ్య ఫణిగిరి గొప్ప బౌద్ధ క్షేత్రంగా విలసిల్లిందని ఆయన వారికి చెప్పారు. అనంతరం విదేశీ బౌద్ధ పరిశోధకులు మాట్లాడుతూ ఫణిగిరి బౌద్ధ శిల్పాలు అద్భుతమన్నారు. ఫణిగిరి బౌద్ధక్షేత్రం పురాతనమైన, గొప్ప చారిత్రక ప్రాంతమని కొనియాడారు. అనంతరం ఫణిగిరి గుట్టపై ఉన్న ప్రాచీన బౌద్ధసంపద, శిల్పాలు, మహాస్థూపాలు, విహారగదులు, శిలాస్థావరాలు, బుద్ధుడి జాతక కథలు పరిశీలించారు. అలాగే మ్యూజియంలో భద్రపర్చిన బౌద్ధసంపదను పరిశీలించి, వాటి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గట్టు నర్సింహారావు, పురావస్తుశాఖ సిబ్బంది గట్టు వీరయ్య, యాకయ్య, కార్తీక్ పాల్గొన్నారు.

పోలీసులకు ‘ఉత్తమ’ పతకాలు

నల్లగొండ రూరల్, సూర్యాపేటటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకాలను ప్రకటించింది. విధి నిర్వహణలో అంకితభావంతో సేవలందించినందుకుగాను.. ఈ పథకాలకు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీస్‌శాఖ నుంచి రాష్ట్ర పోలీస్ మహోన్నత సేవా పతకానికి ఇద్దరు, ఉత్తమ సేవా పతకానికి ఇద్దరు, సేవా పతకానికి 21 మంది ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

పతకాలు పొందినవారు ఇలా..

మహోన్నత సేవా పతకం : 1. జె.సురేందర్, హెడ్‌కానిస్టేబుల్, భువనగిరి, 2. ఎం.అశోక్, ఆర్ఎస్ఐ, నల్లగొండ

ఉత్తమ సేవా పతకం : 1. ఎం.వెంకటేశ్వర్లు, ఏఆర్ఎస్ఐ, డార్ సూర్యాపేట, 2. జి.రమేష్, డీఎస్పీ, స్పెషల్ బ్రాంచ్, నల్లగొండ

సేవా పతకం : 1. సీహెచ్.శివకుమార్, ఏఆర్ఎస్ఐ, భువనగిరి, 2. వి.నాగార్జున, ఏఆర్ ఎస్ఐ, భువనగిరి, 3. ఎండీ.ఇక్బాల్ పాష, ఏఆర్ఎస్ఐ, భువనగిరి, 4. డి.నాగరాజు, ఏఆర్ఎస్ఐ, భువనగిరి, 5. ఎం.శ్రీనివాసులు, ఏఆర్ఎస్ఐ, భువనగిరి, 6. పీవీ శ్రీనివాసులు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, భువనగిరి, 7. ఎన్.శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్, రామన్నపేట పోలీస్‌స్టేషన్, 8. ఎం.నాగేశ్వర్‌రావు, అడిషనల్ ఎస్పీ, సూర్యాపేట, 9. ఎం.వెంకటనారాయణ, ఏఆర్ఎస్ఐ, సూర్యాపేట, 10. పి.వెంకటేశ్వరరావు, ఏఆర్ ఎస్ఐ, సూర్యాపేట, 11. ఎండీ.శంషీర్‌ఖాన్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, సూర్యాపేట, 12. పి.వెంకటయ్య, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, సూర్యాపేట, 13. ఎండి.ఖలీలుల్లాఖాన్, ఎస్ఐ, ఆర్టీసీ నల్లగొండ, 14. పి.శేఖర్, ఏఎస్ఐ, రూరల్ పోలీస్ స్టేషన్, నల్లగొండ, 15. బి.రవిప్రసాద్, ఏఎస్ఐ, డీటీసీ నల్లగొండ, 16. జె.వెంకట్‌రెడ్డి, ఏఎస్ఐ, రూరల్ పోలీస్‌స్టేషన్ నల్లగొండ, 17. పి.రవికుమార్, ఏఎస్ఐ, ఏఆర్, నల్లగొండ, 18. ఎ.యాదగిరిరెడ్డి, ఏఆర్ఎస్ఐ, నల్లగొండ, 19. బి.మోహన్‌రావు ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, నల్లగొండ, 20. కె.శ్రీనివాసరావు, ఏఆర్ఎస్ఐ, 12వ బెటాలియన్, టీజీఎస్పీ అన్నెపర్తి, నల్లగొండ, 21. వై.ప్రతాప్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్, ఇంటలిజెన్స్, నల్లగొండ జోన్

దాడి చేసిన కేసులో ఐదుగురికి జరిమానా

చివ్వెంల(సూర్యాపేట): ఇద్దరు వ్యక్తులపై దాడి చేసిన ఐదుగురికి జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత మంగళవారం తీర్పు వెలువరించారు. నూతన్‌కల్ మండలం తాళ్ల సింగారం గ్రామానికి చెందిన జులూరి సతీష్, జులూరి రాజేష్ 2017లో ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో తమ స్నేహితుడి వివాహానికి వెళ్లారు. అక్కడ వారు భోజనం చేస్తుండగా.. సూర్యాపేటలోని మామిళ్లగడ్డకు చెందిన బత్తులసాయి, కోడి సాయి, పప్పుల ప్రవీణ్ కుమార్, బెజవాడ రాజేష్, బింగి ముఖేష్ అకారణంగా వారిపై దాడి చేసి గాయపర్చారు. బాధితులు ఆత్మకూర్(ఎస్) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ హరికృష్ణ దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు విచారణలో భాగంగా పీపీ హేమలతనాయుడు వాదనలతో జడ్జి ఏకీభవిస్తూ నిందితులకు రూ.3వేలు చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే ఏడు రోజుల శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ చైతన్య సహకరించారు.

సహకార సంఘం క్లర్క్ సస్పెన్షన్

నడిగూడెం: మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం సహకార సంఘంలో క్లర్క్‌గా పనిచేస్తున్న బక్కయ్య కొద్దిరోజులుగా విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నాడు. దీంతో ఆయనని మంగళవారం సస్పెండ్ చేస్తూ తీర్మానం చేసినట్లు సంఘం చైర్మన్ గోసుల రాజేష్ తెలిపారు.





సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

- House For Sale Plot No. 24 3 Ceters and 1BHK (200) Yards Sai Vishwanath Colony, Miryalaguda Road, Nalgonda. Cont: 8897054969 [Y-798603]

Wanted

- రియల్ ఎస్టేట్ Co. HYD, కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe.జీ+కమీషన్+2వీలర్+రూం+భో ఫ్రీ, Age : 30, నె. లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15242]

Services

BUSINESS OFFER

- మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6124]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.









